శ్రీ గురుభ్యోనమః

భూమి గుండ్రంగా ఉంది

(హాస్యభరిత సైన్సు నాటిక) - వి.శ్రీనివాస చక్రవర్తి

వ్యాఖ్యానం - భూమి గుండ్రంగానే ఉంది అని తెలుసుకోడానికి కొన్ని సహస్రాబ్దాల పాటు మనిషి చేసిన శోధన గురించి ఐసాక్ అసిమోవ్ రాసిన వ్యాసానికి ఈ నాటకం ఓ దృశ్యరూపం.

(ఓ పడవలో ఇద్దరు జాలార్లు, మామ, అల్లుళ్లు సముద్రం మీద విహరిస్తుంటారు. మామ వల విసుర్తుంటే అల్లుడు తెడ్డు వేస్తుంటాడు. ఇంతలో మామ విసిరిన వలలో రొయ్యల పంట పండుతుంది.)

మామ - ఓరయ్యో రొయ్య! (పెద్దగా కేక పెడతాడు).

పడిందిరో రొయ్య
పులుసులో వెయ్య
పళ్లెంలో పొయ్య
పండగలే చెయ్య! (పాడుతూ గెంతుతుంటాడు మామ)

(అందించిన మూట అందుకుని ఆనందించకుండా అల్లుడు ఎటో చూస్తుంటాడు.)

మూట అట్టుకో ఎహే!

(మామ కసుర్తాడు. మూట ఇటు అందిస్తే, అల్లుడు చేయి అటు, అటు అందిస్తే చేయి ఇటు చాచుతాడు అల్లుడు. మామకి చిర్రెత్తుకొస్తుంది.)

మామ - అందుకోమంటే ఎకసెక్కే లాడతానవేట్రా? ఏటి ఇసయం?

అల్లు - నాకు అదొద్దు మామా.

మామ - మరేటి కావాలి, చాపలా?

అల్లు - కాదు.

మామ - మరేటి పీతలా?

అల్లు - ఉహు.

మామ - మరేటి కావాల్రా? (గొంతు పెద్దది చేస్తూ)

అల్లు - నాకూ అల్లది కావాల! (దూరంగా ఉన్న సూర్యుణ్ణి వేలితో చూబిస్తూ. మామకి ఏం చూబిస్తున్నాడో అర్థం కాదు. అపార్థం చేసుకుంటాడు.)

మామ - ఏటీ ఆ గెద్దలా? తప్పు రొరేయ్. గరుత్మంతుడు. తింటానన కూడదు! కల్లు పోతయ్!

అల్లు - అబ్బ! నీకెప్పుడూ తిండి గోలే మామా! నాకూ ఆ సూరీడు కావాల!

మామ - ఏటీ? సూరీడు కావాలా? మతి గాని పోయిందేట్రా? తప్పు. లెంపలేస్కో. సూరీడంటే ఏటి? సూర్నారాయన మూర్తి. మనందరికీ, ఈ సముద్రానికి, చేపలకి, పీతలకి, ఈ (మూటని మురిపెంగా ముద్దు పెట్టుకుంటూ) రొయ్యలకి అందరికీ ఆరే దేముడు.

అల్లు - లేదు మామా. చానా కాలంగా చూస్తాన్నను మామా. ఈ సూరీడు రోజూ ఉదయానే ఆ తూర్పు కొండల ఎనకాల్నుండి టంగున పైకి లేస్తడు. పొద్దంతా తెప్ప ఏరు దాటినట్టు ఆకాసమంతా మెల్లంగ దాటుతడు. సాయంకాలానికి ఆల్లక్కడ నీట్లో బుడుంగున మునుగుతడు. పద మామా ఆడికి పోయి యాడ మునిగాడో చూసి ఆణ్ణి అట్టుకుందాం. ఇయాల ఎట్టాగయినా ఆ సూరీణ్ణి అట్టుకుంటే గాని ఇంటికిపొయ్యేదే లేదు.

మామ - నా కూతురు చెప్తా ఉండేది - మా ఆయనకి పిచ్చని. నిజంగా కాస్త ఉండాది. సూరీడు యాడ మునిగాడో పోయి చూసొస్తావా? నీ కోసం ఆడ ఆయన కాసుక్కూసుంటాడు అనుకున్నావేటి?

అల్లు - మరేటి అవుతాడు మావా?

మామ - ఏటవుతాడేటి? ఏట్లో మునిగిపోతడంతే!

అల్లు - అదే మావా! మునిగిపోయి ఏటవుతాడూ అని అడుగుతుండ.

మామ (గొంతు పెద్దది చేస్తూ) - మునిగిపోయి ఏటవుతాడేటి? నీట్లోపలికి దూరిపోయి ఆళ్లమ్మ పెట్టిన బువ్వ తిని తొంగుంటడు. లేకపోతే ఏటా యదవ ప్రశ్న.

అల్లు - (ఒక్క క్షణం మౌనంగా ఉండి) మరయితే ... ఇయాల ఆడ (పడమటి కేసి చూబిస్తూ) మునిగినోడు, మరుసట్రోజు ఆడ (తూర్పు కేసి చూబిస్తూ) ఎట్టా తేల్తాడు మావా?

మామ - ఇయాల నీకు చెప్పాల్సిందే నంటావ్?

అల్లు - (బింకంగా చూస్తూ) సముద్రం గురించి నీకు అంతా తెలుసంటావ్ కద మావా?

మామ - సముద్రం గురించి తెలుసన్నా గాని సూరీడు గురించి తెలుసన్లేదు కదరా! అసలు నిజం చెప్పాలంటే ఒరేయ్! చిన్నప్పుడు ఓ సారి నాకూ సరిగ్గా ఇదే డౌటు ఒచ్చిందన్న మాట. అప్పుడు మా తాత నడిగా. ఆయనేటన్నాడంటే సాయంకాలం సూరీడు మునిగిపోగానే ఆడ ఓ పెద్ద పడవ ఉంటాదట. అచ్చి, ఇలాంటిది కాదు (వాళ్లున్న పడవ చూబిస్తూ) పేద్దది. అందులో సూరీణ్ణి ఎక్కించుకుని రాత్రి రాత్రికి ఆయన్ని సముద్రానికి ఈ చివర్నుండి ఆ చివరికి అట్టుకెళ్లి ఉదయానే ఒదిలేస్తరట. అప్పుడు మనకి తెల్లారుద్దట.

అల్లు- అట్టాగా ? (కళ్లలో కాంతులు కనిపిస్తాయి). అయితే మావా నాకో చిన్న కోరిక.

మామ - ఏటో?

అల్లు - ఇయాల రాత్రికి ఈడే ఉండిపోదాం మావా.

మామ - ఎందుకో?

అల్లు - సూరీణ్ణి ఈ దారి ఎంబటే పట్టుకుపోతారని చెపావు కద మావా? ఈడ చీకట్లో దారి కాసి ఆణ్ణి పట్టుకుందాం మావా?

మామ - ఈ సూరీడు పిచ్చేంట్రా బాబో! (మొత్తుకుంటాడు)

(తనే మళ్లీ) ఒరే పిచ్చి సన్నాసీ! (ఫిలసాఫికల్ నవ్వు నవ్వి) నేను చెప్పడం బాగుంది, నువ్వు యినడం బాగుంది. పడవలో సూరీణ్ణి ఎక్కిస్తే పడవ బుగ్గయిపోదా? పెద్దోళ్లు ఏదో అంటారు. ఇని ఊ కొట్టాల. అంతే.

అల్లు - అంటే, ఇంత సేపు నాకు చెప్పింది ఉత్తిది అన్నమాట (బింకంగా).

మామ - అసలు నిజానికి మా తాత ఏం చెప్పాడంటే...

అల్లు - అదేటి. ఇందాక మరేదో చెప్పాడన్నావ్?

మామ - ఓ అదా? ఆడు వేరు. ఈడు మరో తాత. ఏం చెప్పాడంటే... ఇప్పుడు మన గుడిసె కాడ ఓ మందార చెట్టు లేదూ?

అల్లు - ఉంది.

మామ - దానికి రోజూ పొద్దున్నే తెల్లని మందార పూలు పొడుస్తాయా?

అల్లు - ఔను.

మామ - ఆ పూలు సాయంకాలానికి ఏటవుతాయి?

అల్లు - రాలిపోతయ్.

మామ - కదా? ఈ సూరీడు కూడా అంతే. తెల్లారే ఆ కొండల కాడ పొడుస్తడు. పొద్దుటేళకి నీట్లో రాలిపోతడు. మరి పైకి రాడు.

అల్లు - అట్టాగయితే రేపు ముందే బయల్దేరి ఆడు పడుతూంటే చటుక్కున అట్టుకుందాం.

మామ - పనీ పాట లేదేట్రా? చేపలు అట్టుకోమంటే సూరుణ్ణి అట్టుకుంటానంటాడేటి? ముందు ఈ మూట అట్టుకో. బేగి ఇంటికి పోవాల.

అల్లు - లేదు మామా. ఇయాల ఎట్టాగయినా సూరీణ్ణి ఇంటికి అట్టుకుపోవాల.

మామ - కుదరదహే!

అల్లు - మామా, మామా! (కాళ్లా వేళ్లా పడుతుంటాడు)

మామ - ఒరేయ్ చంపుతున్నావ్! అసలు ఇసయం ఏటంటే అసలు సూరీడు భూమ్మీద లేడు. భూమికి దూరంగా ఆకాసంలో ఉంటాడు.

అల్లు - అవును. గాని సాయంకాలానికి సముద్రంలో మునుగుతాడని ఇందాకేగా అన్నావ్?

మామ - అంటే అదంతా ఏదో మా తాతలు చెప్పింది చెప్పా. అసలు నిజం ఏటంటే...

అల్లు - అదేటి మరి ఇదెవరు చెప్పేరు?

మామ - ఇది మరో తాత చెప్పేడు.

అల్లు - అదేటి నీకు ఉన్నది ఇద్దరు తాతలేగా?

మామ - ఈడు వేరు (అని నాలుక కరుచుకుంటూ) తాతల జోలి మనకెందుకులే గాని, అసలు ఇసయం ఏటంటే సూరీడు నీట్లో మునగడు. ఆకాసంలోనే ఉంటాడు. సాయంకాలానికి భూమి అడుక్కి పోయి దాక్కుంటాడు.

అల్లు - అదేటి పడవకి అడుగు ఉన్నట్టు భూమికి అడుగు ఉంటాదా?

మామ - బంగారంలాగ ఉంటాది. ఇప్పుడు ఈ గంప భూమి (ఓ గంప ఎత్తి పట్టుకుంటూ).

మనం మధ్యలో ఈ చేపల్లాగ ఉన్నాం. చుట్టూ సముద్రం. సముద్రం సివార్లో భూమి అంచు ఉంటాది.

సూరీడు ఈ గంపకి దూరంగా ఇక్కడున్నాడన్న మాట.

అల్లు - అంటే అంచుకాడికి ఎళ్లి తొంగి చూస్తే కింద సూరీడు కనిపిస్తాడా మామా?

మామ - అంచు కాడికి పొయ్యే లోపు పానం పోదూ? అబ్బో ఎంత దూరం, ఎంత దూరం!

అల్లు - ఓ మైలు ఉంటాదా?

మామ - మైలా? హ్హాహ్హా! మరో మాట చెప్పు.

అల్లు - పోనీ నాలుగు మైళ్లు.

మామా - ఒకటి, రెండు కాదేస్! చానా చానా మైళ్లు ఉంటాది.

అల్లు - అసలెవరైనా అంచుకాడికి పోయి చూసొచ్చారా మామా?

మామ - చూసినోళ్లు ఉండొచ్చు. చూసి ఒచ్చినోళ్లు లేరు.

అల్లు - పోనీ మీ తాత? అదే తాతలు?

మామ - మా తాతల ఊసు ఒద్దన్నానా. ఆలీసెం అవుతున్నాది. ఇంటికి పోదాం పద.

అల్లు - భూమి అంచుకాడికి పోయి ఓ సారి ఇట్టా తొంగి చూడాలనుంది మామా!

మామా - ఎట్టా?

అల్లు - ఇట్టా (తొంగి చూబిస్తాడు. ఇదే ఛాన్సని మామ అల్లుణ్ణి సముద్రంలోకి నెట్టుతాడు.

వాడు మొత్తుకుంటూ ఉంటాడు.)

మామ - ఏట్రా అరుస్తున్నావ్. ఎటి కావాల?

అల్లు - రక్షించు మామా, రక్షించు!

మామ - ఏం, సూరీడు ఒద్దా?

అల్లు - ఛస్తే ఒద్దు. పైకి లాగు మామా, సొరచేప కాలట్టుకుంటది.

మామా - అట్టారా దారికి.

(అల్లుణ్ణి పైకి లాగుతాడు. అప్పటికే చీకటి పడుతూ ఉంటుంది. పూర్తిగా తడిసిన అల్లుడు చలికి వణుకుతూ పడవలో కూర్చుంటాడు. మళ్లీ పడవ సంగీతం.)

అల్లు - మామా...

మామ - మళ్లీ ఏట్రా?

అల్లు - చలేస్తాంది. కాస్త సూరీడు ఉంటే బావుంటాది మామా!

మామ - (తలపట్టుకుంటాడు)

(తెర దిగుతుంది)

వ్యాఖ్యానం - ఆ విధంగా భూమి గురించి, సూర్యచంద్రుల గురించి వెర్రి మొర్రి ఆలోచనలు చలామణి అవుతున్న దశలో ఓ గ్రీకు తాత్వికుడు ఈ విషయం గురించి లోతుగా ఆలోచించసాగాడు. అతడే అనాక్సీమాండర్. అదుగో ఏతెన్స్ నగర వీధుల వెంట ఇటే ఏతెంచి వస్తున్నాడు. అయ్యో, అదేంటి! నక్షత్రాలు లెక్కెడుతూ రోడ్డుకి అడ్డుగా ఆ నడకేంటి సార్?

మొదటివాడు - అయ్యా అనాక్సీమాండరూ! తమరా? పట్టపగలు రోడ్డు మధ్యలో ఆకాశం కేసి చస్తూ ఏంటా నడక? ఇంతకీ పైన ఏం కనిపిస్తోందని?

అనాక్సీమాండర్ - చుక్కలు కనిపిస్తాయేమోనని...

రెండోవాడు - నెత్తి బొప్పి కట్టి ఇప్పుడు కనిపిస్తున్నాయా చుక్కలు!

అనా - అబ్బా! (పైకి లేవబోతూ బాధగా మూలుగుతాడు. ఇంతలో అతని శిష్యుడు ఎక్కణ్ణించో పరుగెత్తుకుంటూ వస్తాడు.)

శిష్య - గురూగారూ! మళ్లీ పడ్డారా? (గురువుగార్ని లేవనెత్తి ఆయన చెయ్యి తన భుజం మీద వేసుకుని నడిపిస్తూ తీసుకెళ్తాడు.)

అనా - ఇప్పుడు అర్థమయ్యిందిరా ఢింభా!

శిష్య - ఏంటి రోడ్డుకి అడ్డంగా నడవకూడదనా?

అనా - కాదు.

శిష్య - పోనీ నడిచినా నక్షత్రాల్ని లెక్కెడుతూ నడవకూడదనా?

అనా - అబ్బా కాదు.

శిష్య - మరేంటి స్వామీ అర్థమయ్యింది?

అనా - విశ్వరహస్యం! (ఆయన ముఖంలో ఏదో లోకోత్తర తేజం తాండవిస్తుంటుంది.)

(ఆ ముందు రాత్రి ఏం జరిగిందో శిష్యుడికి ఏకరువు పెట్టుకు వస్తాడు అనాక్సీమాండర్.)

అనా - నిన్న రాత్రి కూడా ఎప్పట్లాగే ఇంట్లో అందరూ పడుకున్నాక గోడ దూకి వెళ్లి నీ మిత్రుడు ఆ శుంఠ డెమియోస్ తోబాటు వెళ్లి బీచికి వెళ్లా. తారల కేసి తదేకంగా చూస్తూ కూర్చున్నా...

(చిన్న ఫ్లాష్ బాక్...)

అనా - రాశావా?

శిష్య2 (వీడు మరొకడు) - ఊ!

అనా - ఏం రాశావ్?

శిష్య 2 - సాయంకాలం 7 :11 నిముషాలని ఉదయించిన సప్తర్షి మండలం ప్రస్తుతం అంటే రాత్రి మూడవ జాము ఆరంభంలో 111 డిగ్రీల 37 నిముషాల దగ్గరికి వచ్చింది.

అనా - గుడ్. మరిప్పుడు స్వాతి ఎక్కడుంది?

శిష్య2 - 8 గం దాకా నాకోసం కాలేజిలోనే వెయిట్ చేస్తానంది. ఇవాళ కూడా 8 లోపల రాకపోతే ఇక జన్మలో ముఖం చూబించనంది. ఎక్కడుందో ఏమో పాపం! (కుర్రాడికి ఇక ఏడుపు ఒక్కటే తక్కువ)

అనా - ఆ స్వాతి కాదు (విసుగ్గా) ఆ స్వాతి (ఆకాశం కేసి చూబిస్తూ).

శిష్య2 - ఓ అదా? ఇవాళ 7 గంటల 59 నిముషాలకే అస్తమించిందండి (వాచీ చూసుకుని ఓ సారి ముక్కు ఎగబీలుస్తూ). మరిప్పుడు లేదు.

అనా - దీన్ని బట్టి నీకేమర్థమవుతోంది?

శిష్య - ఏముందండి? నా గ్రహస్థితి బాగోలేదనండి.

అనా - ముందుగా ఉదయించిన తారలు ముందే అస్తమిస్తున్నాయి. ఆలస్యంగా ఉదయించిన తారలు ఆలస్యంగా అస్తమిస్తున్నాయి. సరిగ్గా ఎన్ని నిముషాలు ముందొస్తే అన్ని నిముషాలు ముందు అస్తమిస్తున్నాయి. అంటే తారలన్నీ ఊకుమ్మడిగా కదుల్తున్నాయన్నమాట.
శిష్య - (ఏదో అర్థమైనట్టు తలాడిస్తాడు.)
అనా - ఇప్పుడు తారల సంగతి అటుంచు. రోజూ సూర్యుడు తూర్పులో ఉదయించి పడమట్లో అస్తమిస్తాడు అవునా?
శిష్య - మీరు మరీ అంత ఇదిగా చెబుతున్నారు కనుక అంతే అయ్యుంటుందండి.
అనా - మరి చంద్రుడి సంగతేంటి?
శిష్య - అదీ అంతే కాబోసండి.
అనా - సూర్య చంద్రుల్లాగే తారలు కూడా ఒకే విధంగా ఉదయిస్తూ అస్తమిస్తూ ఉన్నాయన్నమాట. అంటే నీకేమనిపిస్తోంది?
శిష్య - నాకా అండి? (ఓ సారి ఆకాశంలో తారలన్నిటి కేసి కలయ జూస్తూ) కళ్లు తిరుగుతున్నాయండి.
అనా - కరెక్టుగా చెప్పావు. అన్నీ ఓ చక్రం మీద ఎక్కించి తిప్పినట్టు కలిసికట్టుగా కదులడం లేదూ? నువ్వెప్పుడైనా రంగుల రాట్నం ఎక్కావా?
శిష్య - ఈ కాలేజిలో చేరాక ఎక్కినట్టు గుర్తులేదండి.
అనా - రంగుల రాట్నంలో ఎక్కిన వాళ్లందరూ కదుల్తున్నా వాళ్ల మధ్య దూరాలు మారవు. పైగా కేంద్రానికి దూరంగా ఉన్న వాళ్లు పెద్ద పెద్ద చక్ర గతుల్లో తిరుగుతారు. కాస్త దగ్గరగా ఉన్నవాళ్లు చిన్న చిన్న చక్రగతుల్లో తిరుగుతారు. ఇక కేంద్రంలో ఉన్న స్తంభం అసలు కదలదు. అలాగే తారలు కూడా కొన్ని పెద్ద పెద్ద చక్రాల్లో, కొన్ని చిన్న చిన్న చక్రాల్లో కదుల్తాయి. ఇక ఆ చక్రాల మధ్యలో ఉన్న ఓ ఒంటరి నక్షత్రం కదలకుండా స్థిరంగా ఉంది. అదే ధృవతార. అంటే... అంటే...
(అనాక్సీమాండర్ ముఖం గంభీరంగా మారిపోతుంది. ఏదో మహాసత్యం చాటుతున్న వాడిలా చెప్పుకుపోతుంటాడు.)
విశ్వం అనే ఓ పెద్ద రంగుల రాట్నంలో, ఈ ఖగోళంలో సూర్య చంద్రులు, నక్షత్రాలూ అన్నీ ఎక్కి కలిసికట్టుగా తిరుగుతున్నాయన్నమాట. తారలన్నీ వేరువేరుగా కదలడంలేదు. అసలు తారలు కదలడం లేదు. అవన్నీ ఓ పెద్ద గోళంలో వజ్రాలు పొదిగినట్టు పొదగబడి ఉన్నాయి. కదుల్తున్నది, పరిభ్రమిస్తున్నది కేవలం ఈ గోళమే. ఆ గోళానికి ఓ అక్షం ఉంది. ఆ అక్షం మీదుగా ఉంది కనుకనే ధృవతార కదలడం లేదు. అంచేత ఈ విశ్వం ఒక గోళం ... (గట్టిగా అరుస్తూ) ఈ విశ్వం ఓ పేఏఏఏద్ద గోళం...
శిష్య 2 - (ఇంతలో ఓ చిన్న కునుకు తీసిన వాడు కాస్తా ఆ కేకకి మేలుకుని) నా చదువు గందరగోళం. (అని మనసులో తిట్టుకుంటూ, బయటికి చక్కగా నవ్వుతూ) అంటే ఇన్నాళ్లుగా మిమ్మల్ని వేధిస్తున్న సమస్య తీరిపోయినట్టేగా?
అనా - అవున్రా అబ్బీ. ఇన్నేళ్లుగా అర్థం కాని రహస్యం ఇవాళ అర్థమయ్యింది.
గొప్ప సంతోషంగా ఉంది. పద ఇంటికి పోదాం.
శిష్య2 - అయితే మాస్టారు ఇవాళ్టికి మన పరిశోధన పూర్తయినట్టేనా?

అనా - ఆ, అయిపోయినట్టే. (అని బయటికి నడవబోతూ...) ఓ చిన్న విషయం. ఇవాళ నువ్వు తీసుకున్న డేటా అంతా రేపుపొద్దున్న కల్లా చక్కగా చార్టులు గీసి చూబించేం?

(శిష్యుడు జుట్టు పీక్కోబోతుంటే బయటికి పోబోతున్న వాడల్లా అనాక్సీమాండర్ మరో సారి ఆగి)

అనా - రేపు నేను ఆఫీస్ లో లేకపోతే రిపోర్ట్ నా డోర్ కింద స్లిప్ చేసేయేం!

(శిష్యుడు జుట్టు పీక్కోవడంలో నిమగ్నుడవుతాడు. ఫ్లాష్ బాక్ సమాప్తం).

అనా - అదీ జరిగింది.

శిష్య - అంటే గురూగారూ! ఈ విశ్వం ఓ పరిభ్రమించే నల్లని గోళం, అందులో చమ్కీల్లా అంటించిన తారలు దాంతో పాటు తిరుగుతూ ఉంటాయంటారు?

అనా - అవును.

శిష్య - అయితే నాకో సందేహం. ఇప్పుడు సూర్యుడు ఓ గోళం.

అనా - ఓ అగ్ని గోళం.

శిష్య - విశ్వమూ గోళమే.

అనా - అవును.

శిష్య - మరి చంద్రుడి మాటేమిటి? కొన్ని సార్లు గోళం లా కనిపించినా మరి కొన్ని సార్లు అర్థ చంద్రాకారంలో కనిపిస్తాడే?

అనా - నిజమే. అలా కనిపిస్తాడంతే. కాని నిజానికి చంద్రుడూ గోళమే.

శిష్య - అదెలా?

అనా - చంద్రుడికి తన స్వంత కాంతి లేదు. సూర్యకాంతి మీది పడితే మెరిసి మనని మురిపిస్తుంటాడు. సూర్య కాంతి ఏ దిశ నుండి చంద్రుడు మీద పడుతోంది, మనం ఎట్నుంచి చంద్రుణ్ణి చూస్తున్నాం అన్న దాన్ని బట్టి చంద్రుడు కొన్ని సార్లు గుండ్రంగాను, కొన్ని సార్లు సన్నని కాంతి రేఖ లాగాను కనిపిస్తుంటాడు. కొన్ని సార్లు అసలు కనిపించనే కనిపించడు.

(వెనక తెర మీద ప్రొజెక్షన్ తో కూడుకుని వ్యాఖ్యానం:
భూమి సూర్యుడికి చంద్రుడికి మధ్య ఉన్నప్పుడు, చంద్రుడు మనకి నిండు చందమామలా కనిపిస్తాడు. దాన్నే పున్నమి అంటాం. మనకి సూర్యుడు ఉన్న వైపే చంద్రుడు కూడా ఉన్నప్పుడు, రాత్రి పూట చంద్రుడు కనిపించడు. అదే అమావాస్య. ఈ మధ్య కాలంలో చంద్రుడు ఒక్కో దశలో ఒక్కో రూపంలో కనిపిస్తాడు.)

ఆ విధంగా అనాక్సీమాండర్ సూర్య చంద్రులు గోళాలని అర్థం చేసుకున్నాడు. మొత్తం విశ్వమంతా మరో పెద్ద గోళంగా ఊహించుకున్నాడు. కాని భూమి విషయంలో మాత్రం అది గోళమా కాదా అన్న విషయంలో ఎటూ తేల్చుకోలేకపోయాడు.

భూమిని గోళంగా భావించడమే కాక ఆ గోళం యొక్క చుట్టుకొలత కూడా ఓ చక్కని ప్రయోగం చేసి కచ్చితంగా కనుక్కున్న మరో ఘనుడు ఉన్నాడు. అతడే ఎరొటొస్తినీస్.
పెళ్లీ పెటాకులు లేనివాడు కనుక ఇలాంటి ప్రయోగాలతో జీవితం వెళ్లబుచ్చుతుంటాడు.)

(ఎరొటొస్తినీస్ ఇంట్లో)

ఎరొటొస్తినీస్ - ఒరేయ్!

పనివాడు - అయ్యా, వస్తున్నా!

ఎరొ - చిన్న పని చేసి పెట్టాల్రా చేస్తావా?

పని - చేస్తానండయ్యా, కాని... (భయంగా ఎరొటొస్తినీస్ చేతిలో ఉన్న టేపు కేసి చూస్తూ) కిందటి సారి ఇలాగే చిన్న పని అని చెప్పి అలెగ్జాండ్రియా చుట్టుకొలత అదుగో ఆ టేపుతోనే కొలుచుకు రమ్మన్నారు. ఎండదెబ్బ తగిలి వారం రోజులు మంచమెక్కా.

ఎరొ - అబ్బా. అలాంటిదేం లేదురా. చాలా సింపుల్. ఈ కర్ర పాతాలి అంతే.

పని - ఏంటయ్యగారూ? ఏదైనా పందిరి వేయాలా? ఇప్పటికైనా పెళ్లి మీదకి గాలి గాని మళ్లిందా?

ఎరొ - (కాస్త సిగ్గు పడుతూ) ఛఛ! బలే వాడివే! అలాంటిదేం లేదు.

పని - పోనీ ఏదైనా జెండా ఎగరేయాలా?

ఎరొ - ఒరేయ్ చెప్పిన పని చేస్తావా, కర్రకి బదులు నిన్ను పాతమంటావా?

పని - ఏదో తెలుసుకోవాలని అడిగానయ్యా. మీరే కదా అంటారు. ప్రతీ విషయాన్ని అదేంటదబ్బా... "ప్రశ్నించి, అర్థం చేసుకుని చెయ్యాలి, గుడ్డిగా చెయ్యకూడదు" అంటారు.

ఎరొ - ఏడ్చావులేపో

పని - ఇదుగో పోతున్నా.

ఎరొ - ఎక్కడికి?

పని - పెరట్లో కర్ర పాతడానికి. పోని ముంగిట్లో పాతమంటారా? మళ్లీ ఎప్పుడైనా పందిరికి పనుకొస్తుంది. (వెకిలి నవ్వు నవ్వుతూ)

ఎరొ - అదేమరి. చెపేది పూర్తిగా విను. కర్ర పాతాల్సింది ఇక్కడ కాదు.

పని -మరెక్కడ?

ఎరొ - సీన్ లో.

పని - ఏ సీన్ లో? మొదటి సీన్ లోనా, ఆఖరు సీన్ లోనా?

ఎరొ - సీన్ నగరంలో!

పని - ఏంటీ సీన్ నగరంలోనా? అయ్యా! సీన్ నగరం ఇక్కణ్ణుంచి 500 మైళ్లు ఉంటుంది. అంత దూరం వెళ్లి ఈ చిన్న కర్ర పాతి పరుగెత్తుకు కొచ్చేయమంటారా? ఇంతకీ ఈ మహత్కార్యం ఎందుకు తలపెట్టారో తెలుసుకోవచ్చా మహాప్రభో?

ఎరొ - ఓ చిన్న ప్రయోగం చేయాల్రా. దాంతో భూమి గుండ్రంగా ఉందో లేదో తేలిపోతుంది. నువ్వు చెప్పు. భూమి గుండ్రంగా ఉందా, చదునుగా ఉందా?

పని - ఎదురుగా కనిపిస్తుంటే చిత్రంగా వాదిస్తారేంటయ్యా? చదునుగానే ఉంది.

ఎరొా - అదేంటో చూద్దాం. భూమి బల్ల పరుపుగా ఉంటే ఒకే సమయంలో ఒకే ఎత్తున్న వస్తువుల నీడలు ఒకే పొడవు ఉంటాయి. అలా లేకపోతే భూమి వంపు తిరిగి ఉందన్నమాట.

పని - ఏమోనయ్యా! మీరు చెప్పింది బాగానే ఉంది. ఇంతకీ ఏం చెయ్యాలో చెప్పండి.

ఎరొా - వెంటనే సీన్ కి బయలుదేరు. బుధవారానికల్లా చేరుకుంటావు. గురువారం మధ్యాహ్నం సరిగ్గా 12 గంలకి ఈ కర్ర పాతి దాని నీడ పొడవు కొలుచుకురా.

వ్యాఖ్యానం -

ఒకే పొడవు ఉన్న రెండు కర్రలని 500 మైళ్ల ఎడంలో నేలలో పాతాం అనుకుందాం. ఒక సమయంలో సూర్యుడు ఆ రెండు కర్రలలో ఒక దాని నడి నెత్తి మీద ఉన్నాడు అనుకుందాం. దానికి అసలు నీడ పడదు. కాని రెండవ కర్రకి చిన్న నీడ పడుతుంది. ఆ నీడ పొడవు బట్టి భూమి వ్యాసం కొలవొచ్చు. అలా కొలిచి భూమి వ్యాసం 8000 మైళ్లని అంచనా వేశాడు అనాక్సిమాండర్. అధునిక అంచనాల బట్టి ఆ విలువ 7,900 మైళ్లు.)

(వ్యాఖ్యానం - భూమి ఎలా ఉంటుంది అన్న విషయం మీద కవితలు రాయటం, కొలతలు తీయటం ఇవన్నీ ఒక ఎత్తు. భూమి గుండ్రంగా ఉంది అన్న నమ్మకం మీద ప్రాణాలొడ్డి ఏవో అజ్ఞాత సముద్రాల మీద ధ్వజం ఎత్తటం ఒక ఎత్తు. అలా ధ్వజమెత్తిన ఓ ధీరుడి పేరే కొలంబస్.)

(టక్... టక్ ... టక్)

కొలంబస్ - (తలుపు తీస్తూ) మంత్రిగారూ మీరా? రండి రండి.

మంత్రి - అమ్మయ్య! ఇన్నాళ్లకి దొరికావయ్యా. ఎన్ని సార్లు వచ్చాననుకున్నావు. ఒక సారి వస్తే పోర్చుగల్ వెళ్లావని, మరో సారి వస్తే ఇటలీ, ఇంకోసారేమో సముద్ర యానంలో ఉన్నావని, అదే సముద్రమో నీకే తెలీదని పొరుగింటి వాళ్లన్నారు. పోన్లే ఇన్నాళ్లకి దొరికావు.

కొలం - అయ్యో! నా కోసం చాలా శ్రమ తీసుకున్నారు. రాజమందిరంలో అంతా కులాసాయే కదా?

మంత్రి - ఆ(ఏం కులాసాలే! ఎప్పుడు చూసినా యుద్ధం యుద్ధం! రాజుగారికి, రాణిగారికి ఆ స్పానిష్ మూర్లతో యుద్ధంతోనే సరిపోతోంది. వాళ్లా ఒక పట్టాన చావరు. మనను చంపుకు తింటుంటారు. ధనాగారం ఖాళీ అయిపోతోంది. వాణిజ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఒకప్పుడు ఇండియాతోను, చైనా తోను వాణిజ్యం సజావుగా సాగేది. ఇప్పుడా సిల్కు దారుల వెంట పోతే కొడతామంటున్నారు టర్కులు. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు.

కాస్త మంచినీళ్లు ఉంటే ఇప్పిస్తావా నాయనా?

కొలం - బాబూ డీగో!

డీగో - ఆ(! (లోపల్నుంచి కేక)

కొలం - మంత్రిగారికి కొంచెం మంచినీళ్లు తెచ్చివ్వు నాన్నా.

(డీగో తెర మాటు నుండి మంత్రిగారి కేసి చూసి, నాలుక పైకి పెట్టి వెవ్వెవ్వె అని వెక్కిరించి మాయమవుతాడు.)

కొలం - సారీ. మా వాడు కొంచెం...

మంత్రి - ...చిలిపి. అర్థమయ్యిందిలే.

కొలం - ఉండండి నేను తెస్తాను.

(కొలంబస్ లోపలికి వెళ్తాడు. మంత్రి ఉష్ అంటూ నెత్తి మీద ఉన్న విగ్ తీసి బల్ల మీద పెడతాడు. ఇంతలో డీగో ఎక్కణ్ణుంచో వచ్చి ఆ విగ్ ని గద్దలా తన్నుకు పోతాడు.)

మంత్రి - అయ్యో అయ్యో నా జుట్టు ఇలా తే!

(మంచినీళ్ల గ్లాసుతో కొలంబస్ తిరిగి వచ్చేసరికి మంత్రిగారు, డీగో బల్ల చుట్టూ పరిగెడుతూ దోబూచులాడుతుంటారు.)

కొలం - ఏయ్! డీగో. ఇలారా. తప్పు నాన్నా. అలా మంత్రిగారి జుట్టు చేతిలో పట్టుకుని తిరక్కూడదు. ఇచ్చేసేయ్.

డీగో - ఊహు. ఇవ్వను. ఇవ్వనంటే ఇవ్వనను. దీంతో నా చిలక్కి గూడు కట్టుకుంటా.

(ఒ పెద్ద బల్ల చుట్టూ పరుగెడుతూ కొలంబస్ డీగోని వెంబడిస్తుంటాడు. ఇదే అదను అనుకుని మంత్రిగారు చల్లగా జారుకుంటారు. డీగో వెంటపడుతున్న కొలంబస్ ఉన్నట్లుండి వ్యతిరేక దిశలో పరుగెత్తి డీగోని అందుకుంటాడు. డీగోని ఎలా పట్టుకున్నదీ పునరావలోకనం చెసుకుంటూంటే తన మనసులో ఏదో తళుక్కు మంటుంది.)

కొలం - యురేకా! ఇండియాకి దారి దొరికిందీ!!!

(తేరుకుని చుట్టూ తిరిగి చూసేసరికి మంత్రిగారు కనిపించరు.)

కొలం - మంత్రిగారూ! మంత్రిగారూ!

(మంత్రిగార్ని వెదుక్కుంటూ కొలంబస్ బయటికి పరుగెడుతాడు. ‘డాడీ డాడీ’ అని అరుస్తూ డీగో అతణ్ణి అనుసరిస్తాడు.)

(నిండు సభలో స్పానిష్ రాజు ఫెర్డినాండ్, రాణి ఇసాబెల్ కొలువు తీరి ఉంటారు. జయజయధ్వానాలు వినిపిస్తుంటాయి.)

మహారాణి ఇసబెల్ కి జయహో! జయహో!

(ఆమె ప్రసన్నంగా నవ్వుతుంది.)

మహారాజు ఫెర్డినాండ్ కి జయహో! జయహో!

(ఆయన కూడా ప్రసన్నంగా నవ్వబోతాడు, కాని రాణి చూసిన చూపుకి మానుకుంటాడు.)

(ఇంతలో మంత్రిగార్ని వెదుక్కుంటూ కొలంబస్ ప్రవేశిస్తాడు.)

కొలం - మంత్రిగారూ! మంత్రిగారూ! ఇండియాకి దారి తెలిసింది! (మంత్రిగారి భుజాలు పట్టుకుని కుదిపేస్తూ). ఎలాగో చెప్పనా? ఇప్పుడు మీరు ఇలా రండి... ఇక్కడ ఇలా నించోండి. ఒరే డీగో, నువ్విలా నించో.

(రాణికి ఒళ్లు మండిపోతుంది.)

రాణి - ఎవడీ వెర్రివాడు? నిండు సభలో ఈ ఆటలేంటి? ఎవరక్కడ? ఇద్దరినీ పట్టుకోండి!

మంత్రి - అయ్యో! మహారాణీ! ఇతగాడు పిచ్చివాడు కాదు. కొలంబస్ అని గొప్ప నావికుడు. ఇండియాకి ఏదో దారి చెబుతాను అంటున్నాడు పాపం!

రాణి - ఇండియాకి దారి కొత్తగా చెప్పేదేముంది? ఉందిగా పట్టు దారి. ఆ పట్టు దారి వెంబడి పన్నులు కట్టుకుంటూ పోతే తిరిగి ఇంటికి వచ్చేసరికి పట్టుమని నూరోవంతు లాభం కూడా రాదు.

కొలం - అందుకే మరో దారి ఉందని అంటున్నాను మహారాణీ!

రాణి - ఏదీ? ఆఫ్రికా చుట్టూనా?

కొలం - ఉహు. అది కూడా కాదు.

రాణి - (విస్తుబోయి రాజు కేసి చూస్తుంది. రాజు 'నాకేసి చూస్తావేంటి' అన్నట్టు విస్తుబోయి రాణి కేసి చూస్తాడు)

(కొలంబస్ కేసి చూసి) ఏంటా దారి?

కొలం - నన్నొకసారి విడిచిపెడితే...

రాణి - అతణ్ణి విడిచిపెట్టండి!

(కొలంబస్ సింహాసనానానికి కుడి కొస వద్దకి పోయి అక్కడ నించుంటాడు.

కొలం - ఇప్పుడు నేను స్పెయిన్ దేశాన్ని అనుకుందాం!

రాజు (ఉక్రోషంతో) ఏయ్! స్పెయిన్ ని నేనూ!

(రాణి రాజు కేసి కొరకొర చూస్తుంది)

రాజు - కాదు ఈవిడా!

రాణి - నువ్వు కానీ కొలంబస్.

(భటులని పిలిచి వరుసగా తన పక్కన నించోమంటాడు.)

కొలం - ఇతగాడు ఫ్రాన్స్. ఇతడు ఇటలీ. ఇతడు రొమానియా, ఇతడు టర్కీ. ఇతడు పర్షియా. ఇతడు కందహార్. ఏయ్ డీగో, ఇలా రా! వీడు ఇండియా. ఇప్పుడు స్పెయిన్ నుండి ఇండియా చాలా దూరంలో ఉన్నట్టు అనిపిస్తుంది. భూమి బల్లపరుపుగా ఉంది అనుకుంటే అది నిజమే. కాని భూమి గుండ్రంగా ఉంది. డీగో ఇలా వెనక్కురా! (కొద్దిగా జరిగి డీగో చేయి అదుకుంటాడు.) కనుక ఒక దారి వెంట చాలా దూరంలో ఉన్న ఇండియా మరో దారి వెంట అతిదగ్గరలో ఉంది... చేయి చాచితే అందేంత దగ్గర్లో ఉంది.

రాణి - ఇంతకీ ఏంటా దారి కొలంబస్?

కొలం - మహాసముద్రం మీద పశ్చిమ దిశగా ప్రయాణం.

మంత్రి - మహాసముద్రం మీద ప్రయాణమా? ప్రాణాలతో తిరిగి వద్దామనేనా?

ఓ సభ్యుడు- (కోపంగా) పశ్చిమంగా ప్రయాణిస్తే చేరేది ఇండియా కాదు. నరకానికి.

రాజు - అవునవును. పశ్చిమంగా ప్రయాణించే ఓడలు ప్రపంచం అంచుని చేరి అవతల అగాధంలో పడిపోతాయట. నన్ను పెంచిన ఆయా చెప్పింది. (కళ్లింత చేసి భయంగా అంటాడు.)

కొలం - పశ్చిమంగా సాగితే ధైర్యం ఉన్నవాడికి ధనం, అర్భకులకి అగాధం ఎదురవుతుంది. కొద్దిపాటి సముద్రం దాటితే వచ్చేది ఇండియా, కాథే మొదలైన సంపన్న దేశాలు. దమ్ముంటే ఒక్క అంగలో కడలి దాటి ఆ ఐశ్వర్యాన్ని సొంతం చేసుకోవాలి. నరకం ఎక్కడో లేదు. ఊహకి సంకెళ్లు వేసే మీ మూఢత్వమే నరకం. మీ కళ్లకి కమ్మిన చీకటే అగాధం.
రాణి - కాని గతంలో సముద్ర యాత్రలు చేసిన నావికులు అంతా తీరాన్ని అంటిపెట్టుకుని పోయిన వారే గాని మహాసముద్రాన్ని ఎదురొడ్డిన వారు లేరు కదా కొలంబస్?
కొలం - మొట్టమొదట ఎవరో ఒకరు సాహసించి సాధించకపోతే మనుష్య జాతి ఇంత దూరం వచ్చేదా చెప్పండి రాణీ? హృదయంలో తెగువ లేని వారికి ఎన్ని మాటలు చెప్పినా వృధాయే అని నాకు తెలుసు. దయచేసి సెలవు ఇప్పించండి. (నిష్క్రమించబోతాడు)
రాణి - ఆగు కొలంబస్! నీ ప్రయాణానికి కావలసిన వసతులు నేను అనుగ్రహిస్తాను. తక్షణమే బయల్దేరు.
కొలం - ధన్యుణ్ణి రాణీ! ధన్యుణ్ణి!

(1492లో ఆగస్టు నెలలో సాంటా మరియా, నీనా, పింటా అనే మూడు ఓడలతో బయలుదేరుతాడు కొలంబస్. వాళ్ల ఓడలు ప్రపంచం అంచున అగాధంలో పడిపోలేదు. 12 అక్టోబర్ నాడు ఓ కొత్త భూమి కనిపించింది. అదే ఇండియా అని భ్రమించాడు కొలంబస్. ఆ భ్రమ జీవితాంతం అతణ్ణి విడిచిపెట్టలేదు. కొలంబస్ కనుక్కున్నది ప్రస్తుతం మనం వెస్ట్ ఇండీస్ అనుకునే ద్వీపమాలిక. కొలంబస్ యాత్రలని ఆధారంగా చేసుకుని మరి కాస్త ముందుకి సాగిన అమెరిగో వెస్పుసీ అనే నావికుడు అమెరికా ఖండాన్ని కనుక్కున్నాడు.

భూమి విస్తృతి గురించి అసలేమీ తెలీని రోజుల్లో కూడా భూమి గుండ్రంగా ఉంది అన్న నమ్మకానికి తన జీవితాన్ని పణంగా పెట్టిన గొప్ప శాస్త్రవేత్త కొలంబస్. తన యాత్రలు ఆ నమ్మకాన్ని నిజం చేశాయి అనలేం. ఆ నమ్మకానికి ఆయువు పెంచాయి అని మాత్రం నిశ్చయంగా చెప్పొచ్చు.)

(కొలంబస్ యాత్రలు భూమి గుండ్రంగా ఉందా లేదా అన్న విషయన్నా ఎటూ తేల్చలేకపోయాయి. ఆ మహాకార్యాన్ని తలపెట్టిన మరో నావికుడు ఉనాడు. అతడే మెగాలెన్.)

(స్పానిష్ రాజు ఐదవ కింగ్ చార్లెస్ సభలో)

చార్లెస్ - నేల మీద ఇండియా చేరుకోవడానికి సిల్కు దార్లు ఎప్పుడో మూసుకున్నాయి. ఇండియా కోసం వెదుక్కుంటూ వెళ్లిన కొలంబస్ మరేవో ప్రాంతాలని కనుక్కున్నాడు. అదసలు ఇండియావే కాదని పండితుల అభిప్రాయం. ఆ తరువాత వాస్కో ద గామా ఆఫ్రికా చుట్టూ ఇండియా చేరే పద్ధతి కనుక్కున్నాడు. కాని టోర్డెసిలాస్ ఒప్పందం ప్రకారం ఆ సముద్రపు దార్లు పోర్చుగల్ కే స్వంతం. ఇండియా చేరుకోవడానికి నీ వద్ద ఇంకేదో పథకం ఉందని విన్నాను. ఏమిటది కొంచెం వివరించు మెగాలెన్!

మెగాలన్ - అవును మహారాజా! కొలంబస్ కనుక్కున్నది ఇండియా కాదన్నది నిజం. ఆయన కనుక్కున్నది వెస్ట్ ఇండీస్ అనబడే ఓ ద్వీప మాలిక. వాటి వెనుక అమెరిగో వెస్పుసీ కనుక్కున్న అమెరికా అనబడే ఓ మహా ఖండం ఉంది. ఇంకా దాని వెనుక బల్బోవా చూచాయగా చూసిన మరో మహాసముద్రం కూడా ఉంది. ఆ మహా సముద్రానికి అవతల చైనా, ఇండియా ఉన్నాయి.

రాజు - మరి అంత దూరం ప్రయాణించేదెలా?

మెగాలెన్ - కొలంబస్ అనుసరించిన మార్గంలోనే సాగాలి. కాని ఇంకా దూరం పోవాలి. అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటి దక్షిణ అమెరికా తూర్పు తీరం వెంట దక్షిణ కొమ్మును చేరుకోవాలి. అక్కణ్ణుంచి ఇంకా పశ్చిమంగా ప్రయాణిస్తే స్పైస్ ద్వీపాలు వస్తాయి. స్పైస్ ద్వీపాలు ఎంతో సుభిక్షమైన ప్రాంతాలు. వాటితో వ్యాపారం స్పెయిన్ కి ఎంతో లాభదాయకం.

రాజు - చాలా సాహసం చేస్తున్నావ్ మెగాలెన్! అయిదు ఓడలను తీసుకుని తక్షణమే బయల్దేరు. విజయోస్తు!

(1519 సెప్టెంబర్ 20 నాడు 5 ఒడలు 270 మంది సిబ్బందితో బయలుదేరాడు మెగాలెన్. డిసెంబర్ 13 నాడు ఓ కొత్తతీరం ఏదో కనిపించింది.)

నావికుడు 1 - ఇండియా కనిపించింది. అయ్యగారూ! ఇండియా కనిపించింది!

మెగాలెన్ - అప్పుడే ఇండియా రావడమేమిటి? పొరబడుతున్నావు. ఆ అవకాశమే లేదు.

నావి 1 - లేదయ్యగారూ. అదుగో తీరం మీద ఎవరో ఉన్నారు. అడుగుదాం.

(తీరం మీది మనిషి వైపు తిరిగి) ఇదుగో అబ్బాయ్. ఇది ఇండియావే కదా?

తీరం మనిషి - నో ఇండియా. రియో ద జనేరో!

నావి1- (ఏడుపు ముఖంతో) ఇంత దూరం వచ్చినా ఇంకా ఇండియా రాలేదా? అయినా సరే ఇంక ముందుకు పోయేదే లేదు. ఇంక చాల్లేండి అయ్యగారూ, ఇక్కడే ఆగిపోదాం.

మెగా - పోనీలే. నావికులంతా అలసిపోయి ఉన్నారు. కొన్నాళ్ళాగి బయలుదేరుదాం.

(కొన్నాళ్లయ్యాక ప్రయాణం మళ్లీ కొనసాగింది. కొంత కాలం తరువాత మరేదో తీరం కనిపించింది.)

నావి 1 - అయ్యగారూ! అయ్యగారూ! ఈ సారి నిజంగా ఇండియానే రండి, చూడండి!

మెగా - అప్పుడే ఇండియానా? పోయి కనుక్కుని రా!

(పోయి తిరిగి వచ్చి...)

నావి 1 - నేను ఒప్పుకోను. నేను ఒప్పుకోను. వాడెవడో పిచ్చోడు. వాడెక్కడున్నాడో వాడికే తెలీదు. ఇది ఇండియా కాదట. అదేంటబ్బా... రియో ద ప్లాటా అట.

మెగా - మరి నే చెప్తే విన్లేదు. లంగరెత్తు. బయలుదేరుదాం.

నావి 1 - కుదరదంటే కుదరదు. ఇంచక్కా ఇక్కడే ఉండిపోదాం. ప్లీజ్ అయ్యగారూ!

(సిబ్బంది పోరు పడలేక మెగాలెన్ ఒప్పుకున్నాడు. అక్కడే రెండు నెలలు ఉండి 'సాన్ జూలియాన్' అనే సిబిరం కూడా నిర్మించుకున్నారు. ఎంతో కష్టం మీద సిబ్బందిని మళ్లీ ఉత్తేజితం చేసి లక్ష్యాన్ని జ్ఞాపకం

చేస్తాడు మెగాలెన్. ప్రయాణం మళ్లీ కొనసాగింది. కాని ఈ సారి నిరసన నిష్ఠూరంగా మారింది. ఇద్దరు కెప్టెన్లు తప్పించుకుని పారిపోబోతూ పట్టుబడ్డారు.)

నావి 1 - దొరా! దొరా! ఈ యదవ లిద్దరూ పారిపోతుంటే పట్టుకున్నాం. ఈళ్లకి తగిన శిచ్చ యిధించండి దొరా.

మెగా - ఏం సెబాస్టియన్ ఎందుకు చేశావీపని? ఈ అన్వేషణ, పర్యటన ఓ యుద్ధం లాంటిది. యుద్ధంలో వెన్ను చూబించి పారిపోయేవారికి శిక్షేమిటో నీకు తెలుసుగా?

సెబా - తప్పయిపోయింది మెగాలెన్! దయచేసి ఈ ఒక్క సారికి క్షమించు. బుద్ధి గడ్డి తిని వీళ్లతో చేయి కలిపాను. మళ్లీ నా వల్ల ఇలాంటి తప్పు జరగదు.

మెగా - ఏం గాస్పర్? నీ సంగతేంటి? జరిగిన దానికి ఏం సంజాయిషీ చెబుతావు?

గాస్పర్ - అన్వేషణ, పర్యటన, యుద్ధం... (హహహ) ఇది అన్వేషణ కాదు. ఆత్మహత్య. సామూహిక ఆత్మహత్య. ఇలాగే పోతూ ఉంటే ఏదో రోజు అందరం నడి సముద్రంలో దిక్కు మాలిన చావు చస్తాం. భూమి గుండ్రంగా ఉందట! దిక్కు తెలీకుండా ఏళ్ల తరబడి పడమటి దిక్కుగా పోతే తూర్పు వస్తుందట. ఇంత కన్నా వెర్రితనం ఎక్కడైనా ఉందా? మెగాలెన్! ఇదంతా కేవలం నీ భ్రాంతి. నీ వెర్రితనానికి ఇంత మంది ప్రాణాలని ఎందుకు బలి తీసుకుంటావ్?

(అందరి వైపు తిరిగి) వీడి మాటలు నమ్మకండి! ఇలాగే ఇంకా ముందుకు పోతే వచ్చేది ఇండియా కాదు. లోకం అంచుకి వచ్చేస్తాం. భయంకరమైన శూన్యంలో పడిపోతాం. పదండి వీడి ఖర్మకి వీణ్ణి వదిలిపెట్టి మన స్వదేశానికి వెళ్లిపోదాం. నేటితో ఈ నీటి చెర నుండి తప్పించుకుందాం.

(సెబాస్టియన్ కి క్షమాభిక్ష దొరికింది. గాస్పర్ కి మరణ దండన తప్పలేదు.
పర్యాటక బృందం తమ భయంకర పయనంలో ముందుకి సాగిపోయింది.
అమెరికా దక్షిణ కొమ్ము దగ్గర ఆ నౌకాదళం పశ్చిమంగా తిరిగి ముందుకి సాగిపోయింది. అప్పుడో పెనుకడలి ఎదురయ్యింది.)

నావి 1 - అయ్యా! అయ్యా! అంతం వచ్చేసింది! లోకానికి అంతం వచ్చేసింది. ఇంకా ముందుకి పోతే ఒడలు అగాధంలో పడిపోతాయి.

మెగా - (నవ్వి) కాదు కాదు. ఇది అమెరికా ఖండం అవతల ఉన్న మహాసముద్రం. అబ్బ! ఎంత ప్రశాంతంగా ఉందో! దీనికి ప్రశాంత సముద్రం, అంటే పసిఫిక్ ఓషన్ అని పెరు పెడదాం.

నావి 1 - అయ్యా! ఖండాలు ఇలా వస్తున్నాయి, అలా పోతున్నాయి. సముద్రాలు ఇలా వస్తున్నాయి, అలా పోయతున్నాయి. నేనీ టెన్షన్ భరించలేను గాని అసలు ఇంతకీ ఇండియా నేను చచ్చేలొపు వస్తుందో లేదొ కచ్చితంగా చెప్పేయండి అయ్యగారూ! మీకు పుణ్యం ఉంటుంది.

మెగా - అయ్యో ఇంకేముంది! ఈ మహాసముద్రం దాటితే వచ్చేది ఇండియానే!

(నావికుడు మూర్ఛబోతాడు)

(కొన్ని నెలల ప్రయాణం తరువాత మరో తీరం వచ్చింది.)

మెగా - ఏదో తీరం కనిపిస్తోంది. ఇండియానే అయ్యుండాలి. పోయి కనుక్కొరండి.

నావి 1 - అక్కర్లేదండి అయ్యగారు. అది ఇండియా కాదని కచ్చితంగా చెప్పొచ్చు.
మెగా - అరె! అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావు.
నావి 1 - అయ్యా! భూప్రపంచం అంతా తిప్పుకొచ్చారు. ఇండియా తప్ప మిగతా అన్నీ చూబించారు. ఇంకో రెండు అడుగులు వేస్తే మనిల్లు వచ్చేస్తుందండి. దీనన్నిటి బట్టి నాకు అర్థం అయ్యేదేమిటి అంటేనండి అసలు ఇండియా అనేదే లేదనండి. లేకపోతే రోడ్ల మీద రేగుపళ్లు అమ్మినట్టు రత్నాలు అమ్ముతారా! ఏదో మన బామ్మలు చెప్తుంటే విని ఊకొడుతూ నిదరోయేవాళ్లం. ఆ కథలు విని మన రాజుగారు మీకు మమ్మల్ని అప్పచెప్పి పంపించడం. మీరేమో ఎగేసుకుని సముద్రాలన్నీ ఇండియా ఇండియా అంటూ దేవుళ్లాడడం - మా బాగుందండి!
మెగా - ఏడ్చావులే. పోయి కనుక్కుని రా.
(వాకబు చేస్తే ఆ ప్రాంతం ఫిలిపీన్స్ అనబడే దీవి అని తెలిసింది. అప్పటికే బాగా అలసిపోయిన నౌకా సిబ్బంది అక్కడే కొన్ని నెలలు బస చేసింది. ప్రాంతీయుల కలహాల్లో మెగాలెన్ తల దూర్చవలసి వచ్చింది. ఆ కలహాలే తన ప్రాణం మీదకి వచ్చాయి. మెగాలెన్ మరణ వార్త విని నావికుల మనసులు విలవిలలాడాయి.)
నావి 1 - ఇది అన్యాయం అయ్యగారూ! ఇది అన్యాయం!
కనిపించిన ప్రతీ తీరం ఇండియావే అనుకుని మిమ్మల్ని తొందర పెట్టాను.
ఇండియా ఎంతకీ రాదేంటని మిమ్మల్ని తెగ వేధించాను. చివరికి అసలు ఇండియా అనేదే లేదని సందేహించాను. అయితే అయ్యగారూ! ఇండియా అనేది ఉందో లేదో ఇప్పటికీ నాకు తెలీదు. కాని మీరు పొరబాటు చెయ్యరని మాత్రం నాకు తెలుసు. ఇండియా తప్పకుండా ఉంటుంది. కాని మీరే లేకపోతే ఇంక మాకు ఇండియాకి దారి చూబించే వాళ్లు ఎవరున్నారు అయ్యగారూ? ఇంకెవరున్నారు?

(మెగాలెన్ సిబ్బంది ఇండియా వెళ్ళే ప్రయత్నాన్ని విరమించుకుని నేరుగా స్పెయిన్ కి ప్రయాణమయ్యారు. బయల్దేరిన నాటి నుండి సరిగ్గా మూడేళ్ల తరువాత బృందం స్పెయిన్ చేరుకుంది. బయల్దేరింది 270 మంది అయితే ఇంటికి తిరిగొచ్చింది 18 మంది. ఇండియా అయితే కనిపించలేదు గాని భూమి గుండ్రంగా ఉంది అన్న ప్రతిపాదనకి ఆ మహాయాత్ర మొట్టమొదటి నిదర్శనం అయ్యింది.)

(వ్యాఖ్యానం - ఆ విధంగా సముద్ర యాత్రల వల్ల భూమి గుండ్రంగా ఉందని రూఢి అయ్యింది. కాని అది ప్రత్యక్ష నిదర్శనం కాదు. ఆ నిదర్శనం కావాలంటే అంతరిక్షంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఇరవయ్యో శతాబ్దంలో అంతరిక్షయుగం మొదలయ్యింది. అంతవరకు నేల మీద నించుని ఆకాశం కేసి ఆశగా చూడడానికి అలవాటు పడ్డ మానవుడికి, ఆకాశంలో నించుని భూమి కేసి ఆశ్చర్యంగా చూడగలిగే అవకాశం ఏర్పడింది. చీకటి ఆకాశంలో భూమి నీలి చందమామలా గుండ్రంగా, అందంగా కనిపించింది. భూమి బల్లపరుపుగా ఉంది అని నమ్మే విడ్డూరం మనుషులు ఇప్పటికీ ఉన్నారు. కంటికి కనిపించేదీ, మనసుకి అనిపించేదీ నిజమని నమ్మితే నిస్సందేహంగా భూమి గుండ్రంగానే ఉంది.)